క్లుప్తంగా

ప్రారంభమైన కొండ గంగమ్మ తిరునాల

పెండ్లిమర్రి : ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకుపూజ, అభిషేకాలకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

వేముల : స్థానిక ముస్లింలకు విద్యుత్ శాఖ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న చందా రమేష్‌రెడ్డి శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

సంగీత గురువు రామసుబ్బయ్య మృతి



రామసుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపో కంట్రోలర్‌గా పనిచేసి రిటైర్ అయిన ఆర్టీసీ ఉద్యోగి, హార్మోనిస్ట్ సంగీత గురువు రామసుబ్బయ్య అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి స్థానిక భాకరాపురంలోని మృతుడి ఇంటికి వెళ్లి రామసుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు నివాళులర్పించారు.

ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

పులివెందుల టౌన్ : సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఖాళీగా ఉన్న వార్డెన్లు, కమిటీలు, కుక్కలు, వాచ్‌మెన్ల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిశోర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఎస్పీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారులు రెండు, మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జిలుగా ఉండటంవల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సాంఘిక సంక్షేమ ఏబీసీ, మైనార్టీ వార్డెన్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. దీనివల్ల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

పండుగ పూట పస్తులు ఉండాల్సిందేనా !

వేంపల్లె : జిల్లాలోనే మేజర్ పంచాయతీ అయిన వేంపల్లి గ్రామ పంచాయతీలో గత నాలుగు నెలలుగా 90 మంది సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం దారుణమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం వేంపల్లెలో అయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన వేంపల్లె పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి సస్పెండ్ కావడంతో ఇక్కడ ఉన్న జూనియర్ అసిస్టెంట్ జంగిటి హరికృష్ణ బిల్ కలెక్టర్ల వద్ద ఉన్న రికార్డులు స్వాధీనం చేసుకోవడంతో ప్రజల వద్ద పన్నులు వసూలు చేసేవారు లేకపోవడంతోపాటు సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. పట్టణంలోని చెత్తా చెదారం, మురుగును శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని ప్రతి నిత్యం కాపాడే కార్మికులకు ఉగాది పండుగ ముందర జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

లీకేజీ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి గణిత పరీక్ష ప్రశ్నా పత్రం లీకేజీలపై చీఫ్, డిపార్టుమెంట్ అధికారితోపాటు ఇన్విజిలేటర్‌గా వ్యవహరిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే సస్పెండ్ చేయడం తగదని, ప్రైవేట్ కరస్పాండెంట్‌ను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. కడప నగరంలోని పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లీకేజీల్లో కమలాపురంలోని ఓ ప్రవేటు పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ హస్తం ఉన్నట్లు పోలీసులు చెప్పారన్నారు. వేంపల్లికు చెందిన కొన్ని ప్రైవేటు పాఠశాలలకు చెందిన వారు సూత్రధారులుగా ఉన్నప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు.

వేసవిలో పశు సంరక్షణ తప్పనిసరి

- పాడిరైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- వైద్యుల సూచనలు పాటించాలి

ఎర్రగుంట్ల : వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాయి. సహజంగా 18–35 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. ఆపై అధిక ఉష్ణోగ్రత నమోదైతే పశువులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రధానంగా వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే అవకాశం ఉంటుందని పాడి రైతులు పశువుల సంరక్షణపై ప్రత్యేక మెలకువలు పాటించాలి. వేసవిలో పశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది...

వేసవిలో పశువులకు కావల్సిన మేత దొరకదు. దీని వల్ల పోషకాహార లోపం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీని కారణంగా గొంతవాపు, గాలికుంటు, జబ్బవాపు వ్యాధులు సోకే అవకాశముంది. దీంతో పాటు కలుషితమైన నీరు తాగడం, పశువులకు కడగడం వల్ల అంతర, బాహ్యపరాన్న జీవుల సమస్యలు అధికమవుతాయి. ఈ వ్యాధులు రాకుండా పాడి రైతులు వేసవి ప్రారంభంలోనే ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. అంతర, బాహ్యపరాన్న



ఎండలో ఉన్న గేదెలు

జీవుల నివారణకు నట్టల మందులు వేయించాలి. సమతుల్యమైన పోషకాలు కల్గిన ఆహారం , పరిశుభ్రమైన నీరు తగిన మోతాదులో పశువులకు అందించాలి.

నీరు, ఆహారం తగినంత అధికంగా అందించాలి



వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తీసుకుని ఆహారం తక్కువగా తీసుకుంటుంది. పశువులు తాగేనీరు పుష్కలకంగా, పరిశుభ్రంగా వుండేలా చూసుకోవాలి. నీరు అన్ని వేళలా పశువులకు అందుబాటులో ఉండేలా చూడాలి. ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పగటి పూట పచ్చ గడ్డి, దాణా మిశ్రమాన్ని ఇచ్చి, రాత్రి ఎండుగడ్డి ఇవ్వాలి

– డాక్టర్ మునెయ్య, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ, ఎర్రగుంట్ల



పశువులకు ముందస్తు టీకాలు వేస్తున్నా వైద్యధికారి

వడదెబ్బ తగలకుండా..

పశువులను మేత కోసం పొలాలు, అడువుల్లోకి తీసుకు వెళతారు. వేసవిలో ఇలా చేయడం వల్ల పశువులు అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బకు గురవుతాయి. పశువులు ఎక్కు సమయం ఎండలో వుండడం, తాగునీరు పూర్తిస్థాయిలో లభించకపోవడం వల్ల వడదెబ్బకు గురవుతాయి. పశువు శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడి వేగం బాగా పెరుగుతుంది. చెమట ఎక్కువగా పడుతుంది. కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయే ప్రమాదముంది. పశువుల్లో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వడదెబ్బ తగిలిందని గుర్తించాలి. వెంటనే చల్లని ప్రదేశానికి గానీ, షెడ్‌లోకిగానీ తీసుకు వెళ్లాలి. పశువును చల్లటి, శుభ్రమైన నీటితో కడగాలి. పశువు తాగినంత నీరు, ప్రథమ చికిత్స అందించాలి. ప్రధానంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య కాలంలోనే పశువులను మేత కోసం బయటకు తీసుకువెళ్లాలి. మిగిలిన సమయంలో పాకలో కట్టేసి మేపడం చాలా మంచిది.

అప్రకటిత విద్యుత్‌కోతతో అవస్థలు

ముద్దనూరు : మండు వేసవిలో విద్యుత్ శాఖ విధిస్తున్న అప్రకటిత కోతతో ప్రజలు తీవ్ర అవస్థ పడుతున్నారు. మండలంలో కొద్దిరోజులనుంచి అనధికారికంగా విద్యుత్ కోత విధిస్తున్నారు. ఉదయం వేళల్లో ఒక గంట సమయం, సాయంత్రం వేళలో ఒక గంటపాటు విద్యుత్ కోత విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ఎండలు మండుతున్న వేళ విద్యుత్ కోత వల్ల తాగునీటి మోటరు బోర్లకు అంతరాయం కలుగుతోంది. దీంతో వేసవిలో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవలసివస్తోంది. స్థానిక విద్యుత్ శాఖ అధికారులు మాత్రం మెయిన్ సప్లై నుంచే విద్యుత్ కోత జరుగుతోందని చెప్పుకొస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకు ని విద్యుత్ శాఖ స్పందించాలని స్థానిక ప్రజలు కో రుతున్నారు.

నేడు ఉపాధి 'ఓపెన్‌ఫోరం'

ముద్దనూరు : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు ఏడాదికొకమారు నిర్వహించే ఓపెన్ ఫోరం శనివారం ఉపాధి కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏపీవో గంగయ్య తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధి పథకంలో జరిగిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ మేరకు నేడు ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఏపీవో తెలిపారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలోని 352 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతులలో ప్రవేశాలకు, 7, 8, 9, 10, 12 తరగతులలో మిగిలి ఉన్న సీట్లలో ప్ర వేశాలకు బాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నామని మండల విద్యాశాఖాధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెల 22వ తేదీన మొదులైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 11 వరకు ఉంటుందన్నారు. కేజీబీవీలలో చక్కటి చదువుతో పాటు హాస్టల్ వసతి కూడా ఉంటుందని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసిన పిల్లలు, షెడ్యూల్ కులాలు, షెడ్యులు తెగలు, వెనకబడిన తరగతుల వారు, మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడిన వారు, నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వారపు సంత ద్వారా రూ.5.38 లక్షల ఆదాయం

సింహాద్రిపురం : గ్రామ పంచాయతీ వారపు సంత ద్వారా రూ.5.38 లక్షల ఆదాయం వచ్చిందని విస్తరణాధికారి పద్మనాభరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో గ్రామ పంచాయతీ వారపు సంత 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం 8 మంది పాల్గొనగా.. అందులో రూ.5,38,500లకు హెచ్చు పాటదారునిగా వెంకటరెడ్డి పాట పాడారు. గతంలో రూ.4,20,500ల ఆదాయం రాగా.. ఈ ఏడాది గతంలో కంటే రూ.1,18,000లు ఆదాయం ఎక్కువగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, జూనియర్ అసిస్టెంట్ పుష్పవేణి తదితరులు పాల్గొన్నారు.



వారపు సంత వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీ గౌరీదేవి దేవస్థానంలో శుక్రవారం రాయల్ కాపునాడు ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరం 2025–26కు సంబంధించిన నూతన తెలుగు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయల్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, రాయల్ కాపునాడు యూత్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు కావలి కృష్ణతేజలు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయపరంగా సంఘీయులను పటిష్టం చేయాలన్న సిద్ధాంతంతో రాయల్ కాపునాడు ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాపు, బలిజ, తెలగ, ఒంటరి ఉప కులాలను సంఘటితం చేస్తూ పరస్పర సహాయం పొందేలా కార్యాచరణ రూపొందించుకుంటున్నామన్నారు. ఎంతో చరిత్ర కలిగి ఉండి బలమైన కార్యవర్గం కలిగి ఉన్న వేంపల్లి బలిజ సంఘంలో రాయల్ కాపునాడు నూతన తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ జరగడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో వేంపల్లె బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, ఆరుషేర్ల రంగయ్య, బలిజ సంఘం కార్యవర్గ సభ్యులు పద్మా రాజ్ కుమార్, గాలి హరిప్రసాద్, పసుపులేటి రాము, దాసరి రవిశంకర్, రాయల్ కాపునాడు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నూతన తెలుగు సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రాయల్ కాపునాడు కార్యవర్గ సభ్యులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

సింహాద్రిపురం : తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం మండలంలోని గురిజాల గ్రామంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చూడాలన్నారు. అలాగే ఉపాధి పనులలో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విశ్వేశ్వరరావు, ఉపాధి హామీ ఇసీ శ్రీనివాస్‌రెడ్డి ఎఫ్ఏ భవాని, తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

పోస్టర్ల ఆవిష్కరణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శిల్పారామం, వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లలో ఈనెల 30, 31వ తేదీలలో ఉగాది, రంజాన్, వచ్చేనెల 6వ తేదీన శ్రీరామనవమి పండుగ రోజులలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను శుక్రవారం శిల్పారామ ఏఓ విశ్వనాథరెడ్డి సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ రోజులలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉన్నందున వారి ఆహ్లాదం కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో శిల్పారామ ఏఈ వెంకటసుబ్బయ్య, అసిస్టెంట్ ఏఓ వరప్రసాద్, సూపర్‌వైజర్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శిల్పారామ ఏఓ, తదితరులు

కౌన్సిల్ అనుమతులు తీసుకోకపోతే ఎలా!

జమ్మలమడుగు : మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిపనులను కౌన్సిల్ అనుమతి లేకుండా చేస్తే ఎలా అని 1వ వార్డు కౌన్సిలర్ ముల్లాజానీ శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అడిగారు. అనంతరం చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ మాట్లాడుతూ ప్రతిపనిని కౌన్సిలర్లకు తెలిపి కౌన్సిల్ అమోదంతో జరుపుతున్నామన్నారు. అత్యవసర వాటిని పనిచేసి వాటిని కౌన్సిల్ తీర్మానం కోసం పెడుతున్నామన్నారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఉన్న సమస్యలను, చేయవలసిన పనులను గుర్తించి అధికారులకు అందజేయాలని ఆమె సూచించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో చాలా సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. అధికారులు సమస్యలపై వెంటనే స్పందించాలని సూచించారు. పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉందని ఫాగింగ్ చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, డీఈ సురేంద్రా రెడ్డి, మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

పన్నులు పెంచి ప్రజలపై భారంమోపడం సరికాదు

- కౌన్సిలర్లకు తెలియకుండా పనులు చేయకూడదు
- ఇంటి పన్నుల వసూలులో రాష్ట్రంలో పులివెందులకు మూడవ స్థానం
- రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ జరగలేదు
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నీటి పన్నులు పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలపై ఇలాంటి భారం మోపడం భావ్యం కాదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి సమస్య ఉన్నా కౌన్సిలర్లకు తెలియకుండా ఏ పని చేయరాదని అధికారులకు సూచించారు. వార్డులలో ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం చేపట్టేటప్పుడు ముందుగా ప్రోటోకాల్ ప్రకారం కౌన్సిలర్లకు సమాచారం అందించాలన్నారు. ఒకచోట ఉన్న సచివాలయాన్ని మరొకట చోటికి మార్చాలంటే కౌన్సిల్ ఆమోదం తెలపాలని, అలా కాకుండా సచివాలయాన్ని మరొక చోటికి మార్చాలని చూస్తే కోర్టును ఆశ్రయిస్తామని అధికారులను హెచ్చరించారు. అలాగే ఇంటి పన్నుల వసూలులో రాష్ట్రంలో పులివెందుల మున్సిపాలిటీ మూడవ స్థానంలో ఉందన్నారు. అలాగే పార్టీని ఫిరాయించిన కౌన్సిలర్ల స్థానాలను ముందు వరుసలో ఎలా పెడతారని కొంత మంది కౌన్సిలర్లు ప్రశ్నించగా, దీనికి కమిషనర్ వారిని సెపరేట్ పెట్టాలన్న ఉద్దేశ్యంతో ముందు వరుసలో సీట్లు కేటాయించడం జరిగిందని, తర్వాత జరిగే సమావేశాలలో యథావిధిగా వారికి సీట్లను కేటాయిస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఏ పనిచేసినా ముందుకు కౌన్సిల్‌కు తెలియజేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. అనంతరం 32వ వార్డు కౌన్సిలర్ మహేశ్వరరెడ్డి బ్రాహ్మణపల్లె రోడ్డుకు వీధిలైట్లను ఏర్పాటు చేయాలని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో లేవనెత్తారు. అందుకు డీఈ అలా వీధిలైట్లు వేయడానికి కుదరదని తెలపడంతో ప్రజల సమస్యలను తీర్చమని అడిగామే తప్ప.. మా ఇంటికి వేయాలని అడగలేదన్నారు. బ్రాహ్మణపల్లె రోడ్డులోని టీడీపీ కార్యాలయ సమీపంలో ఎవరూ అడిగారని వీధి లైట్లు ఏర్పాటు చేశారన్నారు. అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే కౌన్సిలర్లు పట్టణంలో రేషన్ బియ్యం పంపిణీ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడే కానీ రేషన్ షాపుల వద్ద బియ్యం సక్రమంగా పంపిణీ జరగలేదన్నారు. కేవలం ఒకట్రెండు రోజులు రేషన్ బియ్యం పంపిణీ చేసి లేవంటున్నారన్నారు. రేషన్ షాపులకు సంబంధించిన ఎండీయూ ఆపరేటర్లు ఉన్నా బియ్యం ఎందుకు రేషన్ షాపులలో పంపిణీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఎండీయూ ఆపరేటర్లను కూర్చొబెట్టి జీతాలు ఊరికే ఇస్తున్నారా అని ప్రశ్నించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఫోన్ ద్వారా ఆర్డీఓ చిన్నయ్యకు ఫోన్ చేసి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడే కానీ రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగలేదని వివరించారు. ఏప్రిల్ నెల నుండి ఇంటింటికి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వాహనాలలో రేషన్ పంపిణీ చేయాలని కోరారు. అలా జరగకపోతే కౌన్సిలర్లతో కలిసి నిరసన తెలియజేస్తామన్నారు. ఇందుకు ఆర్డీఓ స్పందించి అలాగే జరిగేలా చూస్తామన్నారు. కౌన్సిలర్ కోడి రమణ మాట్లాడుతూ డీఈకి ఎప్పుడు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తకుండా సమాధానం ఇవ్వడంలేదని.. ఇలాగైతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కమిషనర్ అటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో వివిధ పనులకు సంబంధించిన గెజిట్‌ను ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

వేలంపాట వాయిదా

ముద్దనూరు : ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ ఆదాయానికి నిర్వహించిన బస్టాండు వేలంపాట శనివారం నాటికి వాయిదా పడింది. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల విస్తరణాధికారి వీరభద్రుడు, పంచాయతీ ఈవో లక్ష్మీనరసింహులు బస్టాండు, జంతువధశాలకు వేలంపాట నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ వేలంపాటలో బస్టాండు నిర్వహణకు రూ.4 లక్షల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనడానికి వేలంపాట దారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో బస్టాండు వేలంపాటను వాయిదావేసినట్లు పంచాయతీ ఈవో తెలిపారు. జంతువధ శాలకు రూ.3,25,000 వేలంపాట జరిగినట్లు ఆయన తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు బస్టాండు నిర్వహణకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

ఎర్రగుంట్లలో చోరీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని వినాయకనగర్‌కాలనీలో నివాసం ఉండి పాలిష్ మీషన్‌లో గుమస్తాగా పనిచేసుకుంటున్న ధనికుల పీరయ్య ఇంటిలో శుక్రవారం చోరీ జరిగింది. బీరువాలో ఉన్న విలువైన బంగారు వస్తువులు, బాండ్లు చోరీకి గురైనట్లు తెలిసింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

60 శాతం హామీలు పరిష్కరించాం

కమలాపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో 60 శాతం అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించామని కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పంచాయతీల వారీగా రివ్యూ నిర్వహించారు. ఏ పంచాయతీల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి? ఎన్ని పరిష్కారం అయ్యాయి? పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? పరిష్కారం కాకపోవడానికి కారణాలేంటి? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో జరిగిని రెవెన్యూ సదస్సుల్లో 4423 అర్జీలు వచ్చాయని, అందులో 60 శాతం అర్జీలను తహసీల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో కలసి సంతృప్తి కరంగా పరిష్కరించామన్నారు. మిగిలినవి కోర్టు సమస్యలు, కుటుంబ తగాదాలున్నవి మాత్రమేనన్నారు. అయితే కోర్టు సమస్యలున్న వారిని కూడా పిలిపించి మాట్లాడామని, రాజీ ధోరణిలో వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. కుటుంబ వివాదాలు ఉన్న సమస్యలను సైతం ఇరువర్గాలు రాజీకి వచ్చి పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా కమలాపురం ఏరియా మిగులు, ఇనాం భూములకు సంబంధించి 500 వరకు అర్జీలు వచ్చాయని, జేసీ సూచనల మేరకు దాదాపుగా ఎక్కువ శాతం అర్జీలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్ ఎర్విన్

29న మార్కెట్ వేలంపాట

వల్లూరు (చెన్నూరు) : ఈనెల 29న మధ్యాహ్నం 3 గంటలకు చెన్నూరు గ్రామపంచాయతీలోని కూరగాయల మార్కెట్, బస్టాండు, జంతు వధశాల, రూములు అద్దె ఇచ్చుటకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచినవారు 29వ తారీకు మధ్యాహ్నం 1:00 గంటకు ధారావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామం పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఎస్.వరప్రసాద్‌రెడ్డి అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళీశ్వర్, తహసీల్దార్ లక్ష్మీదేవిలకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగభూషణ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బుసిరెడ్డిపల్లె గ్రామ సర్పంచు లింగారెడ్డి అనూరాధ మీద రాజకీయ కక్షతో ఎలాగైనా చెక్ పవర్ రద్దు చేయించాలన్న ఉద్దేశంతో బుసిరెడ్డిపల్లె నుంచి గంగిరెడ్డిపల్లెకు రోడ్డు వేయకుండా బిల్లులు చేసుకుందని ఆరోపణ చేశారు. రికార్డులను పరిశీలించగా బుసిరెడ్డిపల్లె నుంచి గంగనపల్లెకు మట్టిరోడ్డు వేశారన్నారు. ఫీల్డ్‌లోకి వెళ్లి పంచాయతీ రాజ్ ఏఈ మల్లారెడ్డి, నేను పరిశీలించామన్నారు. వారికి అనుకూలంగా వ్యవహరించడం లేదన్న కారణంతో నా పైదాడికి పాల్పడ్డారన్నారు. ప్రసాదురెడ్డి (లైన్‌మెన్) విద్యుత్ డిపార్టమెంటు ఉద్యోగి తమకు ఫోన్ చేసి ఎక్కడున్నావు అని అడిగారని ఇంటివద్దనే ఉన్నానని తెలిపానన్నాడు. నీ ఇంటి వద్దకే వస్తున్నాను అంతు చూస్తానని బెదిరించారన్నారు. రాత్రి 7.30 గంటలకు ప్రసాదురెడ్డి తమ అనుచరులతో గురువారం సాయంత్రం వేంపల్లె పట్టణంలోని మా ఇంటికి వచ్చి మీ మొగుడు ఎక్కడికి వెల్లాడో చెప్పాలని నా భార్యను బెదిరించి వెలుతూ ఇంటి వద్ద లేక బతికి పోయాడు, ఈ రోజు కాకపోయినా రేపైనా దొరుకుతాడు చంపుతామని వెళ్లిపోయారు. రాత్రి 8 టంగలకు వేంపల్లె పోలీస్టేషన్‌లో కేసు పెట్టానన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరాడు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలు దరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో 15 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వీఎన్‌పల్లి మండల పంచాయతీ కార్యదర్శి ఇంటిపై దాడికి నిరసనగా సంఘం సంఘీభావం నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఈఓపీఆర్డీ రహమతుల్లయ్యలకు వినతిపత్రం అందజేశారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : వీరపునాయునిపల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు లక్ష్మిపతి తెలిపారు. శుక్రవారం ఆయన పెండ్లిమర్రిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నాగభూషణ్ రెడ్డి ఇంటిపై దాడి చేసి ఆయన భార్య కళావతమ్మను దుర్భాషలాడడం హేమమైన చర్య అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మీద జరుగుతున్న దాడులను ఉపేక్షించ కూడదని అలాంటి వారిపై చర్యలు తీసుకొవాలని ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిల సంఘం ప్రధాన కార్యదర్శి సుధీర్, ఉపాధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వీరపునాయునిపల్లె మండలంలోని పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపైన దాడులకు పాల్పడ్డారని, ఇలాంటి దాడులను ఉపేక్షించేదిలేదని లింగాల పంచాయతీ కార్యదర్శుల సంఘం నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డికి వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఇలాంటి దాడులు నిర్వహిస్తే ఉపేక్షించేలేదిలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.